క్లుప్తంగా

ఎమ్మెల్యే వైవీఆర్ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన మంగళి లక్ష్మన్నకు మంగళవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మన్న భార్య మంగమ్మ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ ఆమె అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండలంలోని సొసైటీ బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు పెద్ద వెంకటరెడ్డి, సీఈఓ ముస్తాఫ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తిస్తాయన్నారు. మార్చి 31లోపు రైతులందరూ వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని వారు కోరారు.

మున్సిపాలిటీ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ పరిశీలన


ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను మంగళవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పరిశీలించారు. గుత్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, టీపీఎస్ మహబూబ్ జాన్, టీపీబీఓ అప్పస్వామి, సర్వేయర్ పుట్టరాజు గుంతకల్లుకు వెళ్లి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన పలు సూచనలు చేశారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ జి.రవి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలకు బదిలీ అయ్యారు. గత ఏడాది జూలై 1న బాధ్యతలు చేపట్టిన ఆయన ఎనిమిది నెలల పాటు కమిషనర్‌గా కొనసాగారు. గుంటూరు జిల్లా నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావును తాడిపత్రికి బదిలీ చేశారు.

వాహనాల వేలంలో రూ.1.06 లక్షల ఆదాయం


వాహనాలు వేలం వేస్తున్న సెబ్ అధికారులు

యాడికి: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సెబ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఆధ్వర్యంలో వేలం వేశారు. మొత్తం 9 ద్విచక్ర వాహనాలను వేలం వేశామని, తద్వారా ప్రభుత్వానికి రూ.1.06 లక్షల ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ శివ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: మండలకేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకాలనికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ మంగళవారం తెలిపారు. కళాశాలలో ఇండో ఎంఐఎం ఫూల్ ప్రతినిధులు బసవరాజ్, డిప్యూటీ మేనేజర్ నటరాజ్, సందేశ్, సందీష్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎస్ఆర్ఐటీ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు రూ.3.2 లక్షలు వేతనంతో సీటీసీతో కలిపి ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు.

ప్రభుత్వ బడులకు నూతన శోభ



నా పేరు రహిమాన్. మాది గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామం. నాకు ఇద్దరు పిల్లలు. మా పెద్ద అమ్మాయిని ఇంగ్లిష్ మీడియం కోసం గార్లదిన్నెలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 3,4,5 తరగతి చదివించాను. కుమారుడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడిలో 4వ తరగతి చదువుతున్నాడు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు- నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చేయడంతో గతంతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. అదనపు గదులు కట్టించారు. క్రీడా ప్రాంగణం, ఇతర మౌలిక సదుపాయాలు బాగున్నాయి. కార్పొరేట్ స్కూల్లో కూడా ఇలాంటి సదుపాయలు లేవు. దీంతో నా కూతుర్ని ప్రైవేట్ పాఠశాల నుంచి 6వ తరగతికి గార్లదిన్నె ప్రభుత్వ స్కూల్లో చేర్పించాను. పిల్లలను ప్రవేట్ పాఠశాలల్లో చదివించ లేని మాలాంటి సామాన్యులకు ప్రభుత్వ బడులు ఎంతగానో ఉపయోగపడతాయి.


ఆధునికీకరించిన కమలాపురం ప్రాథమిక పాఠశాల


కొప్పలకొండలో తరగతి గదిలో విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం

- నాడు-నేడుతో కార్పొరేట్‌కు దీటుగా మారిన వైనం
- అదనపు గదులు, ప్రహరీల నిర్మాణంతో తప్పిన ఇబ్బందులు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుతున్న విద్యార్థులు

విద్యార్థుల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. 'నాడు – నేడు' ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గార్లదిన్నె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలకు నూతన శోభ తీసుకొచ్చారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. గతంలో అరకొర వసతులు, కూలిపోయే భవనాలు, నల్ల బల్లలు, ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం వంటి కారణాలతో చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చుచేసి పాఠ శాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించింది. ఇప్పటికే శింగనమల నియోజకవర్గంలో మొదటి విడతలో రూ. 51.30 కోట్లు ఖర్చుచేసి 267 పాఠశాలలు పైగా పాఠశాలల్లో నాడు-నేడు పనులు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. అలాగే రెండో విడతలో పాఠశాలలు, అంగన్‌వాడీలను అభివృద్ధి చేస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేస్తోంది. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శింగనమల నియోజకవర్గంలో ఇలా..

మండలం	మొత్తం స్కూళ్ల సంఖ్య	నాడు-నేడు పనులు జరిగినవి	మొత్తం ఖర్చు (రూ.కోట్లలో)
గార్లదిన్నె	45	43	14.64
శింగనమల	52	51	7.69
బీకేఎస్	57	57	10.2
నార్పల	49	36	7.75
పుట్లూరు	46	46	8.50
యల్లనూరు	39	31	2.52

పారదర్శకంగా 'నాడు-నేడు' పనులు



మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి, రెండవ విడతలో 'నాడు-నేడు' పనులు పారదర్శంగా చేశారు.ఎక్కడా ఎలాంటి ఆరోపణలు తావు లేకుండా, తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. గడువులోపు పనులు పూర్తి చేస్తాం. గతంలో ఇంగ్లిష్ మీడియం కోసమే పిల్లలను చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపేవారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. – వెంకటరమణ నాయక్, ఎంఈఓ

పాఠశాలలో వసతులు బాగున్నాయి



గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో నేను 9వ తరగతి చదువుతున్నాను. గతంలో విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు లేవు. చదువుకునేందుకు ఇబ్బందులు పడ్డాం. నాడు-నేడు పనుల్లో భాగంగా మా పాఠశాలలో అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుతం మా పాఠశాల రూపురేఖలు మారాయి.బాల బాలికలకు అన్ని రకాల సౌకార్యాలు కలిపించారు. తరగతి గదిలో ఫ్యాన్లు, లైటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు – సాయి చరణ్య, 9వ తరగతి ,గార్లదిన్నె హైస్కూల్

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు ఉచిత వైద్యం


పుట్లూరు మండలం శనగలగూడూరు గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు


గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామ సచివాలయంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని డాక్టర్ శ్రీవాణి అన్నారు. మంగళవారం మండలంలోని శనగలగూడూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ మోహన్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి మాట్లాడుతూ సురక్ష క్యాంపులో రెఫరల్ కేసులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం 431 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కళ్లఅద్దాలు పంపిణీ చేసేందుకు 34 మందిని గుర్తించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు దిలీప్‌కుమార్, స్పెషల్ డాక్టర్లు, హరిక్రిష్ణ, మోహిత, సీహెచ్ఓ లోకనాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వర రావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులపల్లి ప్రాథమిక వైద్యాధికారి వీ సుధాకర్, డాక్టర్ ఉదయార్క ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు వెంకటరమణ, నితిన్‌కుమార్‌రెడ్డి 501 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అందులో ఆరోగ్యశ్రీ కింద ఏడుగురిని రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహ, ఫక్ర, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పామిడి మండలం వంకరాజుకాలువ గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి


హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రగతి మైత్రి మహిళా సంఘం సభ్యులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రగతి మైత్రి మహిళా సంఘం, జంగం శ్రీనివాసులు కళాజాత బృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది? వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమాజంలో కలసి ఎలా జీవించాలి, సుఖ వ్యాధులు వాటి చికిత్స వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


చిన్నవడుగూరులో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాల్లోని ప్రజలు శాంతియుతంగా పోలింగ్ నిర్వహించడానికి సహకరించాలని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, యాడికి సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని చిత్రచేడు, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ పాత కక్షలు మనస్సులో పెట్టుకొని ఘర్షణలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ఎవరికైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాత కేసుల్లోని నేరస్థుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నూతన వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడటం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చౌడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి పారాయణం చేస్తున్న భక్తులు


బైరెడ్డి సిద్దార్థరెడ్డి, హరీష్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తాడిపత్రిటౌన్: మండలంలోని యర్రగుంటపల్లిలో చౌడమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అవరణలో హోమాలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు, అర్చకుడు వీరేష్ ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏపీ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, యాదవ కార్పోరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారిని శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీ


మాట్లాడుతున్న ఓటరు నమోదు అధికారి శ్రీను వెన్నల

శింగనమల: ఓటరు జాబితా తప్పులు లేకుండా పారదర్శకంగాఅందిస్తామని శింగనమల నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి శ్రీను వెన్నల అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాజకీయ పార్టీల తరపున ఒక్కొక్కరికి ఆహ్వానం పంపారు. అయితే టీడీపీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ మంది హాజరవడంతోపాటు అవగాహన లేని ప్రశ్నలు వేయడంతో అధికారులు విస్తుపోయారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకూ ఫిర్యాదుల నమోదుకు శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో ఒక అధికారిని నియమిస్తామన్నారు. తహసీల్దార్ శోభన్‌బాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సిబ్బంది ఉదయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు నల్లప్ప, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

పెద్దపప్పూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ యువనాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన శింగనగుట్టపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


ట్రాక్టర్‌ను పట్టుకున్న సెబ్ సీఐ శివకుమార్

యాడికి: ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సెబ్ సీఐ శివకుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తాడిపత్రి మండలం గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ పెన్నానది నుంచి ఐదుటన్నుల ఇసుకతో యాడికి మండలం తిప్పారెడ్డిపల్లె మీదుగా రవాణా చేస్తుంటే పట్టుకుని సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు


మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీఓ వెంకటరమణప్ప జెడ్పీటీసీ కదిరప్ప సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓకార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటివల్ల ప్రజలకు కలుగుతున్న లబ్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించిన ప్రభుత్వం, రబీ సీజన్‌లోనూ పంట నష్ట పరిహారాన్ని ప్రకటించిందని ఏఓ స్వాతి తెలిపారు. అలాగే 2 వేల ఎకరాలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేకపోవడంతో నీటి ఎద్దడి మొదలైందని, ఇప్పటికే మండలంలోని గుర్రబ్బాడు, వెంకటాంపల్లి, మొలకలపెంట గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అశ్విని తెలిపారు. జగనన్న కాలనీల కింద మండలానికి 350 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇందులో దాదాపు 70 శాతం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని హౌసింగ్ ఏఈ వెంకటేష్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ మస్తాన్ రావు తెలిపారు. అదేవిధంగా వివిధ శాఖల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, వాటిని ప్రజలు ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయాలను ఆయా శాఖల అధికారులు వివరించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి


డాక్టర్ రమణనాయక్

శింగనమల: శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ రమణనాయక్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించడంతో అనంతపురం మెడికల్ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, అదే కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేయడం సంతోషంగా ఉందన్నారు.

రీసోర్స్ కోఆర్డినేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రనాగప్ప



పుట్లూరు: స్వచ్ఛ భారత్ మండల రీసోర్స్ కోఆర్డినేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పుట్లూరు మండల కోఆర్డినేటర్ కడవకల్లు ఎర్రనాగప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం అనంతపురంలో నిర్వహించిన కోఆర్డినేటర్ల సమావేశంలో తనను యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకోవడంపై ఎర్రనాగప్ప హర్షం వ్యక్తం చేశారు. తోటి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

మార్కెట్, జంతు వధశాలకు నేడు వేలం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 31 వరకూ సుంకం వసూలుకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. దినసరి మార్కెట్, జంతు వధశాలకు వేలం ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభిస్తామని, ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.వెంకటరమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

హుండీ కానుకల లెక్కింపు వాయిదా

గుంతకల్లురూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం చేపట్టాల్సిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు ఈఓ భద్రాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

అగ్రి ల్యాబ్‌లు రైతులకు ఉపయోగకరం

గుత్తి: అగ్రి ల్యాబ్‌లు రైతులకు ఉపయోగకరమని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గుత్తి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న వైఎస్సార్ అగ్రి ల్యాబ్ వద్ద మంగళవారం రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 147 అగ్రి ల్యాబ్‌ల నిర్మాణం జరుగుతున్నాయని, జిల్లాలోనే 13 అగ్రి ల్యాబ్‌లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అగ్రి ల్యాబ్‌ల వల్ల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. విత్తనాల నాణ్యతతో పాటు ఎరువులు, పురుగుల మందులు, నేల స్వభావం వంటి వాటిని అగ్రి ల్యాబ్స్‌లో టెస్టింగ్ చేస్తారన్నారు. రైతులు అగ్రి ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు రామరంగారెడ్డి, గోపాల్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ కృష్ణభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు


గాయపడిన రామాంజనేయులు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

పుట్లూరు: ఉపాధి హామీ కింద 200 రోజులు పని దినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలి చెల్లించి కూలీలనుఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వినతిపత్రం అందించారు. వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పెద్దయ్య, పూలరంగడు పాల్గొన్నారు.

5న బహిరంగ వేలం

అనంతపురం కల్చరల్: జిల్లాలోని మరూరు టోల్ గేట్, పీఏబీఆర్, గుత్తి మండలం సేవాఘడ్ క్షేత్రాల వద్ద పర్యాటక శాఖ నిర్మాణాలను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలకు అప్పగించడానికి టూరిజం శాఖ వచ్చే నెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తోంది. ఈమేరకు ఆశాఖ జిల్లా అధికారి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల్గిన వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఎదురుగా ఉన్న జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ఫారాలు కూడా కార్యాలయంలో లభ్యమవుతాయని పేర్కొన్నారు.